దోమలను ఇలా తరిమేద్దాం



- చిన్న చిన్న జాగ్రత్తలతో మశకాల పని పట్టొచ్చు
- వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు అవగాహనే అసలు మందు

దాబాగార్డెన్స్:

పాతనగరంలోని చాలా ప్రాంతాలు దోమలకు నిలయంగా మారిపోయాయి. డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల వ్యాప్తికి కారణమయ్యే వీటి వల్ల ప్రజలు విలవిల్లాడుతున్నారు. దోమల నివారణకు జీవీఎంసీ యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేకుండా పోతోంది. దోమలు మాత్రం స్వైర విహారం చేస్తూ ప్రజలను పట్టి పీడిస్తూ జ్వరాలకు గురి చేస్తున్నాయి.

దోమలకు ఆవాసాలివీ..

ప్రధానంగా దోమలు నీటికుంటలు.. గడ్డి ఎక్కువగా ఉండే ప్రాంతాలు, మురుగునీటి కాల్వలు, వంతెనల కింద నిల్వ ఉండే నీటి పరిసరాలను తమ స్థావరాలుగా ఎంచుకుంటాయి. ఇలాంటి ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై ప్రధాన దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తున్నా ఆ రసాయనాలకు సైతం దోమలు నాశనం కావడం లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మురికివాడల్లో ఈ సమస్య అధికంగా ఉంది. నగర శివారు ప్రాంతాలు, మురుగు కాలువలు అధికంగా ఉన్న ప్రదేశాల్లో దోమల బెడద అధికంగా ఉంది. అందుకే ఎవరికి వారు వాటిని అదుపు చేయాలి.

కాఫీ, టీ డికాక్షన్‌తో నిర్వీర్యం..

ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ, డికాక్షన్ చల్లడం ద్వారా ఆ నీటిలోని దోమల గుడ్లు నీటి పైకి చేరతాయి. దాంతో ఆక్సిజన్ అందక దోమలుగా మారకుండానే నిర్వీర్యమైపోతాయి. ఆ నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.

ఐస్‌తో నైస్..

దోమలు మనం విడిచిపెట్టే కార్బన్ డయాక్సైడ్‌కు ఆకర్షితమవుతాయి. అందుకని వాటిని మరో రూపంలో వలవేసి పట్టాలంటున్నారు నిపుణులు. ఐస్ గడ్డలు కూడా కార్బన్ డయాక్సైడ్‌ను విడుదల చేస్తాయి. అందుకే ఐస్ గడ్డలను ఓ కంటెయినర్‌లో ఉంచి ఇంట్లో అక్కడక్కడ ఉంచాలి. దోమలు వీటి దగ్గరకు చేరతాయి. అప్పుడు దోమల ఎలక్ట్రిక్ బ్యాట్‌ను తీసుకొని వాటి భరతం పట్టాలి.

కర్పూరం చాలా మేలు..

దాదాపు ప్రతి ఇంట్లోనూ కర్పూరం ఉంటుంది. ఇది దోమల సంహారానికి చక్కగా పని చేస్తుంది. చీకటి పడుతున్న సమయంలో ఇంటి తలుపులన్నీ మూసేసి పెద్ద కర్పూరం వెలిగించండి. ఆ తర్వాత ఇంటి బయటకి వెళ్లి తలుపులు మూసెయ్యాలి. ఓ 20 నిమిషాల తర్వాత తలుపులు తెరిచి చూడాలి. ఒక్క దోమ కూడా కనిపించదు. దాదాపు అన్నీ చచ్చిపోయి ఉంటాయి. ఎక్కువ సమయం పాటు కీటక నివారిణిగా కర్పూరం పని చేస్తుంది అంతే కాకుండా ఒక చిన్న పాత్ర తీసుకుని అందులో నీరు పోసి ఒకటి లేదా రెండు కర్పూరం బిళ్లల్ని విరిచి అందులో వేసి గదిలో పెడితే మంచి ఫలితం ఉంటుంది. ఈ నీరు రెండు రోజులకోసారి మార్చుకోవాలి.



దోమలకు ఆవాసంగా మారే రోజుల తరబడి నిలిచిపోయిన మురుగు నీరు

ఈ సూచనలు పాటిస్తే మేలు..

- ముఖ్యంగా సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తర్వాత ఇంటి తలుపులు తెరవరాదు. ఆ సమయంలో దోమలు ఎక్కువ చురుగ్గా ఉంటాయి. అప్పుడే ఎక్కువ శాతం దోమలు ఇంట్లోకి చొరబడతాయి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఇంటి లోపల, ఇంటి పైన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు మూతలు బిగించి ఉంచాలి.
- దోమలు నీటికి కూడా ఆకర్షితమవుతాయి. అందుకే వెడల్పాటి పాత్రలో సబ్బు నీరు ఉంచి ఇంటి ద్వారం వద్ద ఉంచాలి. అవి ఆ నీటిపై వాలి అందులోనే చిక్కుకుని మరణిస్తాయి.

పుదీనాతో దోమలకు రాం రాం

పుదీనా లేపనాలు దోమల నివారణకు సమర్థవంతంగా పని చేస్తాయని **జర్నల్ ఆఫ్ బయో రీసోర్స్ టెక్నాలజీ పేర్కొంది.** పుదీనా ఆకులను నీళ్లలో కాచి ఇంట్లో స్ప్రే చేయడం లేదా, **వేపరైజర్‌గా ఉపయోగించు**కోవడం వల్ల **ఫలితం ఉంటుంది. పుదీనా** ఆయిల్‌ను చర్మంపై **రాసుకోవచ్చు. పుదీనా** మొక్కల్ని కిటికీల **వద్ద ఉంచుకున్నా దోమల** నుంచి రక్షణ పొం**దవచ్చు.**



మురుగు నీటితో నిండిన పాత టైరు

పిచ్చి మొక్కల బదులు..

పిచ్చి మొక్కలు ఎక్కువ ఉంటే దోమల సంతాన ఉత్పత్తి కేంద్రాలుగా మారుతాయి. చాలా మంది అందం కోసం అనేక మొక్కలు పెంచుతారు. వాటికి బదులు ఇళ్లల్లో తులసి, పుదీనా, సిట్రోనెల్లా, లెమన్ గ్రాస్ వంటి మొక్కలను కుండీల్లో పెంచుకోవడం వల్ల దోమలు చాలా వరకూ కంట్రోల్ అవుతాయి.

తులసి దళాలు దివ్య ఔషధాలు..

పారాసైటాలజీ అనే పత్రిక దోమల నివారణలో తులసి ప్రాధాన్యం గురించి రాసింది. దోమల లార్వాను చంపేందుకు తులసి చక్కగా పని చేస్తుందని పేర్కొంది. మన ఆయుర్వేదం కూడా ఇదే చెప్పింది. ప్రతి ఇంట్లోనూ తులసి మొక్కలు ఉంచుకోవడం వల్ల దోమల బాధ తొలగిపోతుంది. మార్కెట్లో లభించే టీ ట్రీ ఆయిల్ కూడా దోమల నివారణకు ఓ చక్కని పరిష్కారం. దీన్ని వాడడం వల్ల దోమల నివారణే కాదు చర్మ సౌందర్యానికి కూడా ఉపయోగపడుతుంది. ఇందులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు దోమలు కుట్టకుండా ఉపయోగపడతాయి. ఈ నూనె నుంచి వచ్చే సువాసన దోమలకు ఇబ్బందికరం. అందుకే అవి అక్కడ ఉండకుండా పరార్ అవుతాయి.

రుషికొండ ప్యాలెస్‌ను సైన్స్ అభివృద్ధికి వినియోగించాలి

- సీపీఎం డిమాండ్

దాబాగార్డెన్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్‌ను సైన్స్ అభివృద్ధికి వినియోగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు కోరారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగించాలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు పర్యాటక శాఖ, కూటమి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ భవనాలను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సైన్స్ మ్యూజియం, సైన్స్ పార్క్‌గా శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి వినియోగించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలోనే దీని నిర్వహణ ఉండాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఓవైపు ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతూ, మరోవైపు విజయవాడలో పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు పూనుకోవడం సరైనది కాదన్నారు. ఈ భవనాన్ని ప్రజావసరాలకు వినియోగించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో ప్రతి గృహం, అపార్ట్‌మెంట్ల నివాసితులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఇంటింటి చెత్త సేకరణలో భాగస్వాములు కావాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలు సేకరిస్తూ క్లాప్ వాహనాల ద్వారా తరలిస్తున్నారని, ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జీవీఎంసీ నిరంతరం చర్యలు చేపట్టిందన్నారు. నగరంలో నిత్యం 610 క్లాప్ వాహనాలు, 65 ఈ-ఆటోల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడంతో పాటు 1100 డంపర్, కాంపాక్టర్ బిన్స్ సేకరణ, తరలింపు ప్రక్రియను జీవీఎంసీ నిత్యం జరుపుతోందన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి నిత్యం తమ ఇంటికి వచ్చే క్లాప్ వాహనాలకు వ్యర్థాలు అందించాలని, లేదా సమీపంలో ఉన్న డంపర్ బిన్, కాంపాక్టర్ బిన్‌లో వేసి నగర పరిశుభ్రతకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

కలాం చైతన్యం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీఎంఏ నివేదిత, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బీఎస్ అనూష ఇతర బోధన సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కలాం దృష్టి, కృషి, విద్యా, ప్రేమ ప్రతి విద్యార్థికి స్ఫూర్తి కావాలన్నారు. విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆలోచన, పరిశోధనా తపన, విలువలతో కూడిన జీవన విధానాన్ని పెంపొందించే దిశగా కార్యక్రమం సాగింది. విద్యార్థులు 2025 నోబెల్ బహుమతులు అందుకున్న వివిధ రంగాల నోబెల్ లారియేట్స్‌పై ఆకర్షణీయమైన ప్రజంటేషన్లు ఇచ్చారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని అబ్దుల్ కలాం ఆలోచనలు, ఆదర్శాలు తమ జీవితాలకు మార్గదర్శకంగా తీసుకోవాలని సంకల్పించారు.

విధుల్లో లేని వైద్య సిబ్బందిపై డీఎంహెచ్‌వో ఆగ్రహం



విద్యుత్ నగర్ యూపీహెచ్‌సీలో రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: విధి నిర్వహణలో వైద్యుడు, సూపర్‌వైజర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ నగర్ యూపీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది ఎవరైనా క్షేత్ర సందర్శనకు వెళ్లినప్పుడు మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. నమోదు చేయకుండా ఎక్కడికి వెళ్తున్నారని డీఎంహెచ్‌వో ప్రశ్నించారు. ఏఎన్ఎంలకు అభ ఐడీ అత్యధిక శాతం పెండింగ్‌లో ఉండటం వల్ల వైద్యాధికారి, సిబ్బంది డ్యూటీ తర్వాత తనను కలవాలన్నారు. ఆరోగ్య కేంద్రం సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

మా వాకర్స్ క్లబ్ కొత్త కార్యవర్గం ఎన్నిక



మా వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్‌లోని మా వాకర్స్ అసోసియేషన్ 2025 -2027 కార్యవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడిగా బాల చెన్నయ్య, అధ్యక్షుడిగా యు.అప్పలకొండ, ఉపాధ్యక్షుడిగా బి.వి.ఎస్.మూర్తి, కార్యదర్శిగా పి.అప్పలనాయుడు, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, నిర్వహణ కార్యదర్శిగా పి.సతీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల పరిశీలకులు పి.కొండలరావు, బి.కనకరాజు ప్రకటించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తరఫున క్లబ్ సభ్యులకు డ్రెస్ కోడ్‌లో భాగంగా తెలుపు, నీలం రంగు టీ షర్టులు పంపిణీ చేశారు.

రైల్వేస్టేషన్‌లో 5 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, రవాణాదారుడిని అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ, సీఐబీ సంయుక్తంగా తమ సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒడిశా కోరాపుట్ జిల్లాకు చెందిన దేవేందర్ ఖోస్లా కోరాపుట్ నుంచి విశాఖకు అక్రమంగా గంజాయిని తీసుకురావడాన్ని గుర్తించి అరెస్ట్ చేశారు. రూ.25 వేల విలువైన 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు డిమాండ్



నిరసన తెలుపుతున్న అఖిలభారత యువజన సమైక్య సభ్యులు

బీచ్‌రోడ్డు: ఏపీకి ప్రత్యేక హోదా కల్పించి, విభజన హామీలు అమలు చేయాలని, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేయాలని కోరుతూ బుధవారం అఖిలభారత యువజన సమైక్య ప్రతినిధుల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆందోళన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, ఎం. యుగంధర్ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయం ఎన్డీఏ ప్రభుత్వం పూర్తిగా మర్చిపోయిందన్నారు. కూటమి నాయకులు కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు హోదా సంజీవిని కాదని ప్యాకేజీ మంచిదని చెప్పి ప్రత్యేక హోదా నినాదాన్ని పాతాళానికి తొక్కేసారన్నారు. బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌ను పూర్తిగా కార్పొరేటు కంపెనీలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందని, దీనిలో భాగంగానే వీఆర్ఎస్, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, ప్లాంట్ ఉద్యోగుల కుదింపు వంటివి చేస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అచ్యుతరావు మాట్లాడుతూ జీఎస్టీ పేరుతో గత ఎనిమిదేళ్లు కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుందన్నారు. జీఎస్టీ 2.0తో సామాన్యులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలని చూస్తుంటే.. ఇక్కడ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తుందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. లేని పక్షంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వై.రాంబాబు, సహాయ కార్యదర్శి కొమరం సందీప్, శివ, యు.నాగరాజు, కార్యవర్గ సభ్యులు మధు రెడ్డి, కెల్లా రమణ, శ్రీను, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ట్రాక్ మెయింటెయినర్ల మహాధర్నా



ధర్నా చేస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు, ట్రాక్ మెయింటెయినర్లు

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో ట్రాక్ మెయింటెయినర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం దొండపర్తి డీఆర్ఎం కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజనల్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు మాట్లాడుతూ టాక్ మెయింటెయినర్లపై వేధింపులు ఆపాలని, పెట్రోలింగ్ బీట్ 20 కిలోమీటర్ల నుంచి 12 కిలోమీటర్లకు తగ్గించాలని, అర్హులైన ట్రాక్ మెయింటనర్లకు కెరీర్‌ను మెరుగుపరచుకునేందుకు 10 శాతం కోటా కల్పించాలని, ఎల్‌డీసీఈ, జీడీసీఈ అవకాశాలు అందించాలని, రైల్వే బోర్డు మార్గదర్శకాల ప్రకారం సేఫ్టీ కిట్లను అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూనియన్ నాయకులు డీఆర్ఎం లలిత్ బోహ్రాను కలసి మెమోరాండం సమర్పించారు. కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ ఆర్.వి.ఎస్.ఎస్.రావు, డిప్యూటీ డివిజనల్ కో ఆర్డినేటర్లు యు.చంద్రకుమార్, సహాయ కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, అధిక సంఖ్యలో ట్రాక్‌మెన్‌లు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ సేవలకు ఆరో రోజూ బ్రేక్

- పేద రోగుల కష్టాలు రెట్టింపు

మహారాణిపేట: జిల్లాలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలు నిలిచిపోయి ఆరు రోజులైంది. ఈ పరిస్థితి వల్ల పేద రోగుల ఇబ్బందులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. నెట్‌వర్క్ ఆస్పత్రులకు చికిత్స కోసం వెళ్లిన రోగులు చేదు అనుభవంతో వెనుదిరుగుతున్నారు. ఆస్పత్రులలో అడ్మిషన్లు లభించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 10 నుంచి జిల్లాలోని అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆస్పత్రులు ఈ నిర్ణయం తీసుకున్నాయి. కాగా.. జిల్లాలో ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ పరిధిలో మొత్తం 63 ఆస్పత్రులు ఉన్నాయి. సమ్మెలో ఉన్న ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతంలో 27 నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెలో ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 33కు చేరింది. బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని ఆస్పత్రుల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ఉద్దేశించిన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, వర్కింగ్ జర్నలిస్టులకు అందించే వైద్య సేవలు కూడా నామమాత్రంగానే అందుతున్నాయి.

చదువుతోపాటు క్రీడలూ ముఖ్యం



క్రీడాకారులను అభినందిస్తున్న శ్రీనివాసరావు

సీతంపేట: విద్యార్థులు చదవుతో పాటు ఆరోగ్యాన్నిచ్చే క్రీడలపై ఆసక్తి చూపించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ మెంబర్ సంపంగి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం ఆయన తన ఇంటి వద్ద ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పతకాలు సాధించిన వారికి తనవంతు సహాయం అందిస్తానని, భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. పోటీల్లో సీతంపేటకు చెందిన మైక్ బాక్సింగ్ క్లబ్ క్రీడాకారులు మెడల్స్ సాధించారు. క్లబ్ తరఫున ఐదుగురు క్రీడాకారులు పాల్గొనగా.. 17 ఇయర్స్ కేటగిరీలో రోహిత్, సాయిలోహిత్ గోల్డ్ మెడళ్లు, కె.భాగ్యశ్రీ కాంస్య పతకం గెలుపొందారు. అండర్ 14 కేటగిరీలో మహీదర్ రజత పతకం సాధించింది. కార్యక్రమంలో క్లబ్ హెడ్‌కోచ్ హరీష్, కోచ్ దినేష్ పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ



చేతులు శుభ్రం చేసుకుంటున్న ఆర్‌డబ్ల్యుఎస్‌ఈ రామస్వామి. చిత్రంలో సీఈవో నారాయణమూర్తి తదితరులు

మహారాణిపేట: చేతులు శుభ్రం చేసుకోవడాన్ని అలవాటుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ సీఈవో పి.నారాయణమూర్తి అన్నారు. ప్రపంచ హ్యాండ్ వాష్ దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చేతుల పరిశుభ్రత వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని మండల ప్రజా పరిషత్‌లు, గ్రామ సచివాలయాల్లో చేతులు కడుక్కునే సౌకర్యం అందుబాటులో ఉండేలా చూడడంలో సహకరిస్తామని సీఈవో హామీ ఇచ్చారు. అనంతరం ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా జిల్లా ఎస్ఈ ఎ.ఎస్.ఎ. రామస్వామి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, అనకాపల్లి డీపీవో సందీప్, సంఘం నాయకులు ఎస్. సత్తిబాబు, పి.వి.వి.ఎస్. మూర్తి, ఎ. మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



స్వామి వివేకానంద సంస్థలో అన్నదానం చేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని స్వామి వివేకానంద స్వచ్ఛంద సంస్థలో బుధవారం నిరుపేదలకు అన్నదానం జరిగింది. రోటరీక్లబ్ వైజాగ్ కపుల్స్ ప్రెసిడెంట్ కంచర్ల రాంప్రసాద్ సతీమణి అన్నపూర్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో కంచర్ల రాంప్రసాద్, కుటుంబ సభ్యులు నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ కుటుంబ సభ్యులకు స్వామి వివేకానంద సంస్థ కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, కంచర్ల రాంప్రసాద్, అన్నపూర్ణ, నందిత తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా రైల్వే సేవలు

తాటిచెట్లపాలెం: ప్రత్యేక క్యాంపెయిన్-5లో భాగంగా ప్రయాణికుల భాగస్వామ్యంతో కూడిన అమృత్ సంవాద్ కార్యక్రమాన్ని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో బుధవారం నిర్వహించారు. వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజినీర్ ఎ.కె.మహారాణా రైల్వే ప్రయాణికులతో ముచ్చటించారు. రైల్వే సేవలను మరింత మెరుగు పరిచేందుకు వారి సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ నెల 31 వరకు జరిగే ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా ప్రయాణికుల నుంచి స్వయంగా సూచనలు స్వీకరిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ అధికారులు, సిబ్బంది పల్గొన్నారు.

బలవంతపు భూ సేకరణ ఆపాలి



సమావేశంలో పాల్గొన్న ఆంధ్ర ఐక్య ఉద్యమాల నాయకులు

- ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక నేతల డిమాండ్

సీతంపేట: ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని 'ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక' నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐక్యవేదిక నేతలు మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ఉద్యమాల సమాహారమే ఆంధ్ర ఉద్యమాల ఐక్య వేదిక అని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న భూ దోపిడీకి వ్యతిరేకంగా అన్ని ఉద్యమాల్ని ఏకతాటిపై తెచ్చి బలోపేతం చేయడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. అందులో భాగంగా ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న బలవంతపు భూ సేకరణ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, అంబుజా సిమెంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఉద్దానం నుంచి తడ వరకు ఉద్యమం చేపట్టినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వ భూ దోపిడీకి ఉత్తరాంధ్ర బలైపోయిందన్నారు. ఉద్దానంలో కార్గో ఎయిర్ పోర్టుకు 3 వేల ఎకరాలు, విజయనగరం జిల్లా ఎస్.కోట ప్రాంతంలో జిందాల్ ఎంఎస్ఎంఈ పార్క్ పేరుతో సుమారు 1500 ఎకరాలు, వెన్నలవలసలో ప్రాణాంతక థర్మల్ పవర్ ప్లాంట్‌కు 2 వేల ఎకరాలు, నక్కపల్లిలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కులకు 5 వేల ఎకరాలు సేకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక టీసీఎస్, ఉర్సా క్లస్టర్లకు కేవలం ఎకరం 99 పైసలకే ఇవ్వడం దేశంలో మరే రాష్ట్రంలోనూ జరగలేదని ఆక్షేపించారు. ఈ సంస్థలకు అప్పనంగా రాయితీలు, భూములిస్తూ విశాఖ స్టీల్ ప్లాంటుకు రూ.33 వేల కోట్ల సహాయం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రాకపోవడం శోచనీయమన్నారు. కార్పొరేట్ సంస్థలకు రూ.16 లక్షల కోట్లను మాఫీ చేసిన కేంద్రం విశాఖ ఉక్కుకు రూ.33 వేల కోట్లను మాఫీ చేయడానికి మాత్రం ముందుకు రావడంలేదన్నారు. ప్రస్తుతం అధిక కాలుష్యాన్ని వెదజల్లే అంబుజా అదానీ సిమెంట్ కంపెనీకి అన్ని పర్మిషన్లు ఇవ్వాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును అమలుకు ముందుగా స్థానిక ప్రజలతో చర్చించాల్సిందేనన్నారు. మేధావులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, కష్టనష్టాల్ని బేరీజు వేయాలన్నారు. సమావేశంలో ఆంధ్ర ఉద్యమాల ఐక్యవేదిక కన్వీనర్ వీఎస్ మహదేవ్, ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి, అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట కమిటీ ప్రతినిధి, న్యాయవాది పల్లా కార్తీక్, పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సీహెచ్ ప్రమీల, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ ప్రతినిధి, న్యాయవాది కేఎస్ చలం, స్టీల్ ప్లాంట్ యూజ్ నాయకుడు కె.పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును దెబ్బతీసే కుట్రలు మానుకోవాలి



మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విశాఖ ఉక్కును దెబ్బతీసే కుట్రలు మానుకోవాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి బుధవారం సిటు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీ ఇచ్చి, లాభాలు బాట పట్టిస్తామని ప్రకటించిందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలో విశాఖ ఉక్కు అధికారులతో సమీక్ష నిర్వహించి స్టీల్‌ప్లాంట్ ప్రగతిపథం వైపు దూసుకుపోతుందని, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభించి ఉత్పత్తి పెంచామని, ప్లాంట్ అభివృద్ధికి పాటుపడుతున్నామని ప్రకటించారన్నారు. 2025 జూన్‌లో రెండు ఫర్నేస్‌లు రోజుకు 14 వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసేవని, ప్రస్తుతం మూడు ఫర్నేస్‌లు పనిచేస్తున్నా 16 వేల టన్నులు మాత్రమే రోజుకు స్టీల్ ఉత్పత్తి అవుతోందన్నారు. దీనికి ప్రధాన కారణం కేంద్ర ప్యాకేజీ నిధులు, ముడిసరుకు, యంత్రాలు, కార్మికుల జీతభత్యాలకు వినియోగించరాదని ఆంక్షలు పెట్టారన్నారు. నాణ్యత లేని ఐరన్‌ఓర్, పిల్లెట్స్, కోక్ వినియోగించడం వల్ల యంత్రాలు పాడైపోతున్నాయన్నారు. దీనివల్ల ఎస్ఎంఎస్-2లో పూర్తి స్థాయి ఉత్పత్తి తీయలేని స్థితి ఏర్పడిందన్నారు. ఇటీవల స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించిన కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి విశాఖ ఉక్కు యంత్రాలు 35 ఏళ్ల కిందటి నాటివని, వీటి మెయింటెనెన్స్ సక్రమంగా చేయక ఉత్పత్తికి అవరోధాలు ఏర్పడుతున్నాయని స్వయంగా ప్రకటించారన్నారు. అయినా ప్రభుత్వంలో చలనమే లేదన్నారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి, యంత్రాల మరమ్మతులు, కొత్త యంత్రాల కొనుగోలుకు, కార్మికుల జీతభత్యాల చెల్లింపునకు, తొలగించిన 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్ల సహకారంతో దొంగతనాల కట్టడి

మర్రిపాలెం: ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిపై అందరూ అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని వెస్ట్ క్రైం సీఐ చంద్రమౌళి సూచించారు. కప్పరాడ జంక్షన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లకు ఆయన పలు దొంగతనాలపై అవగాహన కల్పించారు. దొంగతనాలు చేసేవారు ఆటోల్లోనే తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారని, అలాంటి అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని కోరారు. ఆటో డ్రైవర్లంతా కలిసి ఒకే చోట ఆటోలు నిలపాలని, ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇటీవల రాత్రి పూట ఆటోల చక్రాలు, బ్యాటరీలు చోరీలకు గురవుతున్నాయని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వాటిని నియంత్రించవచ్చని చెప్పారు. ఆటో డ్రైవర్లు యూనియన్‌గా ఏర్పడి ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.